క్లుప్తంగా

సీసీ రహదారి నిర్మాణం



శ్రీరామపురంలో సీసీ రహదారి నిర్మాణం పనులు

కపిలేశ్వరపురం: మండలంలోని మాచర గ్రామ శివారు మాచరమట్టలులో సీసీ రహదారి నిర్మాణం చేపట్టారు. పనులను జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ వాసంశెట్టి సునీత ఆదివారం పరిశీలించారు. పనులను సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాస్ పర్యవేక్షించారు. ప్రాధాన్యతా క్రమంలో గ్రామ రహదారులను మెరుగుపర్చుతున్నట్టు ప్రజాప్రతినిధులు తెలిపారు.

స్థలదాతకు సత్కారం



భవానీశంకర్‌ను సత్కరిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: లక్ష్మీవాసవి ఆర్యవైశ్య సంఘ కమ్యూనిటీ హాల్ నిర్మాణ నిమిత్తం చోడవరం గ్రామ పంచాయతీ పరిధిలో రూ.30 లక్షల విలువ చేసే స్థలాన్ని కొనుగోలు చేసి సంఘానికి ఇచ్చిన దాత విశ్రాంత ఉపాధ్యాయులు పట్నాల భవాని శంకర్‌ని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. దాతని అభినందించి కమ్యూనిటీ హాల్ నిర్మాణం నిమిత్తం రూ.10 లక్షల నిధులు సమకూరుస్తానని మంత్రి వేణు తెలిపారు. మంత్రి తనయుడు నరేన్ యువసేన సోషల్ మీడియా ఆధ్వర్యంలో మరో రూ.లక్ష నిర్మాణానికి ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో లక్ష్మీ వాసవి ఆర్యవైశ్య సంఘం పెద్దలు, ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

మండపేట: పట్టణంలోని గొల్లపుంత కాలనీకి చెందిన శ్రీమోక్ష స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఆదివారం ఆదివారం కాలనీకి చెందిన వంద మంది పేదలకు ఆహార ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు ఎగ్గాడి లోవరాజు మాట్లాడుతూ ఉన్నంతలో పేదల ఆకలి తీర్చాలన్న ఆశయంతో పెయింటింగ్, ఇతర చిన్నచిన్న పనులు చేసుకునే యువకులు సంస్థగా ఏర్పడి అన్నదాన కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. సంస్థ సభ్యుడు ఎగ్గాడి సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తాతపూడి సందీప్, మందపల్లి సూరిబాబు, చాపల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్తకుప్పలు తొలగించాలి

కాజులూరు: మండలంలోని తిప్పరాజుపాలెంలో రోడ్లపై పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించేందుకు పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో ఏ ఒక్క ప్రాంతంలో డంపింగ్ సదుపాయం లేకపోవడంతో స్థానికులు గృహవాసాల్లోన్ని చెత్తా చెదారం గ్రామ ముఖద్వారంలోని రోడ్డుపక్కన పారవేస్తున్నారు. పశువులు, కుక్కలు, కోళ్ల సంచారంతో రోడ్డు పక్కన పారవేసిన చెత్తకుప్పలు రోడ్డపైకి పొల్లుకు వస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న చెదురుమదురు వర్షాల కారణంగా రోడ్డుపై చేరిన చెత్త కుళ్లిపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. రోడ్లు అధ్వానంగా తయారై పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారవుతుందని దీంతో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్త కుప్పలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని బాధిత ప్రజలు కోరుతున్నారు.

అబ్బుర పరుస్తున్న పంపర పనస చెట్టు



మొగలిపాలెంలో చూపరులను అబ్బుర పరుస్తున్న పంపర పనస చెట్టు

కాజులూరు: మండలంలోని మొగలిపాలెంలో ఒక పంపర పనస చెట్టు చూపరులను అబ్బురపరుస్తుంది. శలపాక చానల్ ఎదుట రోడ్డు పక్కన పొలంగట్టుపై ఉన్న ఈ పప్పల పనస చెట్టు నిండైన పెద్ద, పెద్ద కాయలతో చూపరులను ఆకర్షిస్తుంది. ఆరడుగుల ఎత్తు గల చెట్టుకు చిన్నా, పెద్ద సుమారుగా ముప్పై కాయలు పైబడి ఉన్నాయి. కాయల బరువుకు కొమ్మలు విరిగిపోకుండా రైతు కర్రలను సపోర్టుగా ఉంచారు. వరి పొలంకువేసే ఎరువులను గట్టుపై ఉన్న మొక్క సమృద్ధిగా వినియోగించుకోవడం ద్వారా ఆరోగ్యంగా పెరిగి నిండైన కాయలు కాస్తుందని ఏఓ వి.అశోక్ అభిప్రాయపడ్డారు.

పేదల ఆరోగ్యానికి సురక్ష

- వైద్య సేవలతో రోగులకు 14 రకాల ఉచిత వైద్య పరీక్షలు
- రెండు నియోజకవర్గాల్లో రెండు లక్షల మందికి అందనున్న సేవలు



కె.గంగవరం మండలం అముజూరులో ఇళ్ల వద్ద పేదలకు అందుతున్న వైద్య సేవలు

కె.గంగవరం: మారుమూల పల్లెల్లో సైతం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వ శ్రీకారం చుట్టింది. ఇందు భాగంగానే ఇప్పటికే పల్లెల్లో వలంటీర్లు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే కొనసాగించారు. గ్రామీణ ప్రాంత ఇళ్లల్లో కుటుంబ సభ్యులకు ఏఏ వ్యాధులున్నాయి. ఏ మందులివ్వాలి, వారికి ఎలాంటి వైద్య సేవలు అందించాలనే వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపుల వద్ద అవసరమైన వారికి చికిత్స నిమిత్తం టోకెట్లు కూడా జారీ చేస్తున్నారు.

14 రకాల వైద్య పరీక్షలు

రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్షలో 14 రకాల వైద్య పరీక్షలతో పాటు ఇతర జబ్బులను సైతం గుర్తించి కార్పొరేట్ వైద్య సేవలు కూడా ప్రస్తుతం వైద్య సిబ్బంది అందిస్తున్నారు. ఇందులో బీపీ, సుగర్, మలేరియా, హిమోగ్లోబిన్, డెంగీ పరీక్షలతో పాటు ఇతర రోగులను గుర్తించి వారికి ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారు. ప్రత్యేక చికిత్స అవసరమైన వారిని గుర్తించి అన్ని వసతులు ఉన్న ఆసుపత్రులకు రోగులకు తరలిస్తున్నారు.

35 గ్రామాలు, 14 వార్డుల్లో పూర్తయిన వైద్య శిబిరాలు

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లో ఇప్పటి వరకు రోజుకు ఒక్క గ్రామం చొప్పున 35 గ్రామాల్లో, మున్సిపాలిటీ పరిధిలో 14 వార్డుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పూర్తయ్యాయి. ఈ శిబిరాల్లో 30 వేల మందికి పైగా వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు అందాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సచివాలయం పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు జరిగిన వైద్య శిబిరాలతో పాటు నిర్దేశించిన సమయానికి జరిగే అన్ని గ్రామాల్లో దాదాపు 2 లక్షల మందికి వైద్య సేవలు అందుతాయని వైద్య సిబ్బంది చెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు వైద్య సేవలను కూడా ఇంటి వద్దకే రప్పించి ఉచితంగా మందులు అందించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తాం



జగనన్న ఆరోగ్య సురక్షలో ఇప్పటికే నిర్వహించిన సర్వే ప్రకారం ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. మిగిలిన గ్రామాల్లో కూడా వైద్య శిబిరాలు నిర్వహించి ఎవరెవరికి ఏఏ రోగాలు ఉన్నాయో తెలుసుకుని వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు అందజేస్తాం.

– ఎస్.శ్రీనివాసరావు, ఎంపీడీఓ, కె.గంగవరం

గతంలో ఏ ప్రభుత్వమూ ఇలా చేయలేదు



గతంలో ఎప్పుడూ ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించలేదు. పెద్ద ఎత్తున గ్రామాల్లో శిబిరాలు నిర్వహించడంతో పాటు ఉచితంగా అన్ని రకాల మందులు అందిస్తున్నారు. వృద్ధులు, పేదలకు ఈ పథకం గొప్ప వరం లాటింది. ప్రజల నుంచి మంచి స్పందన వస్తుంది.

– ఇళ్ల సూర్యనారాయణ, శివల

గ్రామాల్లో ఆరోగ్య సర్వే



వడ్లమూరులో ఇంటి వద్ద లబ్ధిదారుకు బీపీ పరీక్ష చేస్తున్న ఆరోగ్య కార్యకర్త

కపిలేశ్వరపురం: మండలంలోని వడ్లమూరు, నేలటూరు తదితర గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇంటింటి ఆరోగ్య సర్వే చేపట్టారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి కరుణేంద్రకుమారి పర్యవేక్షణలో ఆరోగ్య కార్యకర్త విజయదుర్గ, ఆశ కార్యకర్తలు సర్వే చేశారు. బీపీ, షుగరు, కళ్లు తదితర ఏడు వైద్య పరీక్షలను చేసి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

భూసర్వే ప్రక్రియ వేగవంతం



వల్లూరులో సర్వే రాళ్లు అమర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్న వీఆర్వో, సర్వే సిబ్బంది

కపిలేశ్వరపురం: గ్రామాల్లో భూ సర్వే ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. తహసీల్దార్ కొమరం సూర్యారావు పర్యవేక్షణలో గ్రామ రెవెన్యూ అధికారులు ఆధ్వర్యంలో సర్వే కొనసాగుతోంది. రెండు రోజులుగా వల్లూరులో సర్వే రాళ్లు అమర్చే ప్రక్రియ జరుగుతోంది. భూ హక్కులను పారదర్శకంగా పరిరక్షించే ప్రక్రియలో భాగంగా సర్వే చేపట్టారు.

ముఖ్యమంత్రి సభకు తరలిన ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: మండల స్థాయి ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో సోమవారం విజయవాడలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించినున్న సభకు నియోజకవర్గం నుంచి బయలుదేరి వెళ్లారు. మరికొంత మంది తెల్లవారుజామున బయలుదేరి వెళ్లనున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, జెడ్పీటీసీలు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు, సోషల్ మీడియా ప్రతినిధులకు 32 మందికి ప్రత్యేక ఆహ్వానాలు అందాయి.

గణేష్ ఆటోయూనియన్ ఆధ్వర్యంలో అన్నదానం

మండపేట: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక ట్రావెల్స్ బంగ్లా వద్ద గల శ్రీగణేష్ ఆటోయూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల గణేష్ నవరాత్ర ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు యూనియన్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. వేడుకలు ముగింపులో భాగంగా నిర్వహించిన అన్నసమారాధనలో మూడు వేల మందికి పైగా భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ప్రమాదకర ప్లాస్టిక్‌ను దూరం పెడదాం

- సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ అమ్మకాలపై దేశ వ్యాప్త నిషేధం
- 2022 జూలై 1 నుంచి ప్రారంభం
- క్షేత్ర స్థాయిలో కొనసాగుతున్న కార్యాచరణ



ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగింపజేస్తున్న సచివాలయ ఉద్యోగులు



అంగరలో దుకాణదారునికి నోటీసు ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

కపిలేశ్వరపురం: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం మానవ జీవనానికి అత్యంత ప్రమాదకరం. తాత్కాలిక సదుపాయాల కోసం మొత్తం మానవ సమాజాన్ని ప్రమాదంలోకి నెట్టడాన్ని పర్యావరణవేత్తలు నిరసిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2022 జూలై ఒకటి నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించింది. ఆ నిర్ణయాన్ని అప్పటి నుంచి నేటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తూ పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంది. మండపేట, రామచంద్రపురం పట్టణాలతో పాటు గ్రామాల్లో సైతం అనేకసార్లు సంబంధిత అధికారులు, సచివాలయ ఉద్యోగులు ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు చేస్తూ ఉన్నారు.

క్షేత స్థాయిలో ప్లాస్టిక్ వినియోగమిలా...

మండపేట పట్టణంలో 30, రామచంద్రపురం పట్టణంలో 28 మొత్తం 58 వార్డులు, రామచంద్రపురం రూరల్‌లో 25, కాజులూరు, కె.గంగవరం మండలాల్లో 26 చొప్పున, రాయవరం, మండపేట రూరల్ మండలాల్లో 12 చొప్పున, కపిలేశ్వరపురం మండలంలో 19 గ్రామాల మొత్తం 120 గ్రామాల్లో 2.15 లక్షల కుటుంబాలున్నాయి. రోజుకు సుమారు 23 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు చెత్తలో కలుస్తున్నాయి. నెలకు 15 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు రెండు పట్టణాల్లోనూ తరచూ డంపింగ్ యార్డులు నిండిపోతుండటంతో సమస్య తీవ్రమవుతుంది. ప్లాస్టిక్ వినియోగాన్ని నిలువరించేందుకు సెప్టెంబర్, అక్టోబర్‌లలో క్షేత్ర స్థాయి దుకాణదారులకు నోటీసులను సైతం అందజేశారు. గ్రామాల్లో అవగాహన ర్యాలీలు చేశారు.

ప్లాస్టిక్ ప్రయాణమిలా...

ఇతర రాష్ట్రాల నుంచి విజయవాడ మీదుగా క్షేత్ర స్థాయికి ప్లాస్టిక్ వస్తువులు వస్తున్నాయి. తయారీదారులు, మధ్యవర్తకుల ద్వారా రామచంద్రపురం, మండపేట పట్టణాలకు చేరుకుంటున్నాయి. పట్టణ, గ్రామాల్లోని దుకాణదారుల ద్వారా వినియోగదారులకు చేరుతున్నాయి. తోపుడుబండ్లు, చిరు వ్యాపారులు, దుకాణదారులు ద్వారా క్యారీ బ్యాగులు యథేచ్ఛగా వాడుతున్నారు. వినియోగానంతరం అవి రహదారులు, కాలువలు, నదులు, డ్రెయిన్లకు చేరుతూ పారిశుద్ధ్య ఆరోగ్య సమస్యలను సృష్టిస్తున్నాయి. అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులిద్దరినీ కట్టడి చేసే దిశగా చర్యలు ప్రారంభించారు.

నిషేధితమైనవి ఇవే...

40 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న పాలిథిన్ సంచులు, ఇతర వస్తువులను రీసైక్లింగ్ చేయడం వీలుపడదు. అవి భూమిలో వందేళ్లైనా కరగక కాలుష్యకారకమవుతాయి. ఇయర్ బస్ క్రీమ్, ప్లాస్టిక్ పుల్లలు, ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ట్రేలు, ప్లాస్టిక్ స్వీట్ బాక్సులు, బడ్స్, బెలూన్లు, క్యాండీ, ఫోర్కులు, చెంచాలు, కత్తులు, ఆహ్వాన పత్రాలు, సిగరెట్ ప్యాకెట్లు, 100 మైక్రాన్ల లోపు ఉండే పీవీసీ బ్యానర్లు, అలంకరణకు వాడే థర్మోకోల్ మొదలైనవి నిషేధ జాబితాలో వున్నాయి.

కార్యాచరణ ఇలా...

వార్డు, గ్రామ వలంటీర్లు ఇంటింటా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగం ఉన్న ప్రాంతాలను గుర్తించి సందేశాత్మక బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయంగా వస్త్రం, కాగితంతో తయారైన వస్తువుల వాడకంపై అవగాహన కల్పిస్తారు. నిషేధిత ఉత్పత్తులు విక్రయించినా, వినియోగించిన వారిపై రూ.500 నుంచి రూ.5000 వరకూ అపరాధ రుసుం విధిస్తారు.

సామూహిక కృషి అవసరం



పర్యావరణ సమస్య పరిష్కారానికి ప్రజలంతా సామూహిక ప్రయత్నం ద్వారా కృషి చేయాలి. ఏళ్ళ తరబడి అలవాటు పడటంతో ప్లాస్టిక్ వినియోగం పట్ల అయిష్టత సహజం. చివరకు పాలిథిన్ కవర్‌లో టీ, కాఫీలను క్యారీ చేస్తున్నారని విన్నాను. ప్రమాదకరమైన వినియోగంతో మానవాళికి ముప్పు పొంచి వుంది. నిబంధనలను నిబద్ధతతో పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

–ఎస్ఎస్‌వీ శ్రీనివాస్, అధ్యాపకులు, అంగర

చురుగ్గా వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులు



ద్రాక్షారామ పీహెచ్‌సీ ఆవరణలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు



వెలంపాలెం జగనన్న కాలనీలో నిర్మాణమవుతున్న వాటర్ ట్యాంకు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ, వెలంపాలెం గ్రామాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ జల్‌జీవన్ మిషన్ పథకం కింద మంజూరు చేయించి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ద్రాక్షారామలో రూ.166.50 లక్షలతో 2 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు, వెలంపాలెంలో రూ.112.50 లక్షలతో 1.2 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకుల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. దీంతో ఆయా గ్రామాల్లో తాగునీరు అందరికీ అందనుంది.

బెట్టింగ్ జోలికెళితే కఠిన చర్యలు తప్పవు

రావులపాలెం: క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ అమాయకులను మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని రావులపాలెం ఎస్సై ఎం.వెంకటరమణ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఐసీసీ క్రికెట్ ప్రపంచ కప్–2023 నేపథ్యంలో ప్రత్యేక నిఘా పెంచామన్నారు. అమాయకుల బలహీనతలను ఆసరాగా చేసుకుని ఎవరైనా డబ్బు ఆశ చూపించి క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా, నిర్వహించినా, ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదన్నారు. ఏపీ జూద చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేస్తామన్నారు. రావులపాలెం పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిస్తే సదరు సమాచారాన్ని డయల్ 100కు సమాచారమివ్వాలన్నారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. యువత బెట్టింగ్ వలలో పడకుండా ఉండాలన్నారు.

మంత్రి అడిషనల్ పీఎస్‌కు సత్కారం




మంత్రి అడిషనల్ పీఎస్‌ను సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అడిషనల్ పీఎస్‌గా నియామకమైన రామచంద్రపురం మండల తహసీల్దార్ పి.తేజేశ్వరరావును మండల రెవెన్యూ సిబ్బంది ఆదివారం ఘనంగా సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ సుదీర్ఘంగా 50 నెలల పాటు తహసీల్దారుగా సేవలందించిన తేజేశ్వరరావు సిబ్బందిని ప్రోత్సహిస్తూ ఎటువంటి ఆరోపణలు లేకుండా రెవెన్యూ వ్యవస్థకి హుందాతనం తెచ్చారన్నారు. ముందుగా మంగళ వాయిద్యాలతో తహసీల్దార్‌ని తోడ్కొని వచ్చి దుశ్శాలువా, పూల మాలలతో సత్కరించారు. గజమాలతో ఆయనను గౌరవించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ జి.శ్రీనివాస్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కర్రి మహాలక్ష్మినాయుడు, ఆర్ఐ పెంకే మునీశ్వర్, మండల సర్వేయర్ నాగేశ్వరరావు, రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి మద్దాల బాపూజీ, మండల ప్రెసిడెంట్ పంపన విష్ణుమూర్తి, వైస్ ప్రెసిడెంట్ నరేష్‌కుమార్, గ్రామ రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

జోరుగా ద్వారపూడి రోడ్డు పనులు

- తొలగిన అడ్డంకులు
- చొరవ తీసుకున్న ఎమ్మెల్సీ తోట



మండపేట మెహర్ స్కూల్ సమీపంలో జరుగుతున్న బీటీ రోడ్డు పనులు

మండపేట: మండపేట – ద్వారపూడి రోడ్డు పనులు జోరుగా జరుగుతున్నాయి. గతంలో అసంపూర్తిగా వదిలిపెట్టిన సీసీ రోడ్డు పనులు పూర్తి చేస్తుండగా, మండపేట నుంచి తాపేశ్వరం మధ్య బీటీ రోడ్డు పనులు మొదలయ్యాయి. నెలాఖరుకు వీటిని పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మండపేట నుంచి ద్వారపూడి వరకూ సుమారు ఆరు కిలోమీటర్ల మేర రూ.12 కోట్ల వ్యయంతో గతంలో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం 5.5 మీటర్ల వెడల్పు ఉన్న రోడ్డును భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఏడు నుంచి 10 మీటర్ల వరకూ విస్తరించి అభివృద్ధి చేస్తున్నారు. మండపేట బైపాస్ వంతెన వద్ద నుంచి తాపేశ్వరం మలుపు వరకు, ఇప్పనపాడు రైస్‌మిల్లు వద్ద నుంచి జెడ్. మేడపాడు వంతెన వరకు 2.6 కిలోమీటర్లు బీటీ రోడ్డు, తాపేశ్వరం, ఇప్పనపాడు గ్రామాల్లో 2.2 కిలోమీటర్లు సీసీ రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. ఇప్పనపాడు రైస్‌మిల్లు వద్ద నుంచి జెడ్. మేడపాడు వంతెన వరకు బీటీ రోడ్డు పూర్తి కాగా వాహనాలు దూసుకు వెళుతున్నాయి. తాపేశ్వరం, ఇప్పనపాడు గ్రామాల్లో 1,850 మీటర్ల మేర ఒక వైపు, 750 మీటర్ల మేర రెండు వైపులా సీసీ రోడ్డు పూర్తయ్యింది. సాంకేతిక కారణాలు, నిధుల విడుదలలో జాప్యంతో ఏడు నెలలుగా నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సమస్యపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఉన్నతాధికారులతో మాట్లాడి బిల్లుల విడుదల చేయించి పనులు ప్రారంభించేందుకు కృషి చేశారు. మూడు వారాల క్రితం పనులు మొదలై జోరుగా జరుగుతున్నాయి. గతంలో ఇప్పనపాడు గ్రామ పరిధిలో అసంపూర్తిగా వదిలివేసిన సీసీ రోడ్డు పనులు పూర్తి చేయగా ప్రస్తుతం తాపేశ్వరం పరిధిలో పూర్తి చేస్తున్నారు. మండపేట బైపాస్ వంతెన వద్ద నుంచి తాపేశ్వరం మలుపు వరకు ఉన్న రోడ్డును ఏడు నుంచి 10 మీటర్లకు వెడల్పు చేస్తూ బీటీ రోడ్డు పనులు మొదలు పెట్టారు. మరో 15 రోజుల్లో బీటీ రోడ్డు పనులు పూర్తవుతాయని ఆర్అండ్ బీ జేఈ సూర్యనారాయణ తెలిపారు. కల్వర్టులు మినహా నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో సీసీ, బీటీ రోడ్డు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చినద్వారపూడి సత్తెమ్మ తల్లి ఆలయం, అర్తమూరు తూము వద్ద ప్రమాదభరితంగా ఉన్న కల్వర్టుల నిర్మాణంపై ఇప్పటికే ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు మధ్యలో ఉన్నందున సాగునీటికి ఆటంకం కలుగకుండా త్వరలో పనులు చేపట్టేందుకు కార్యాచరణ చేస్తున్నామన్నారు. తాపేశ్వరం గ్రామ పరిధిలో రోడ్డు విస్తరణను వ్యతిరేకిస్తూ కొందరు కోర్టును ఆశ్రయించడంతో గ్రామంలోని మార్కెట్ వద్ద నుంచి సాయిబాబా గుడి వరకు ప్రస్తుతం రోడ్డు ఎంత విస్తీర్ణం ఉంటే అంతమేర రోడ్డు నిర్మాణం చేయనున్నట్టు జేఈ సూర్యనారాయణ తెలిపారు.

ఆచారి, రామకృష్ణలకు ఘన నివాళి



ఆచారి, రామకృష్ణల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాటక కళాపరిషత్ సభ్యులు, పెద్దలు

రామచంద్రపురం: ఈ నెల ఒకటిన మృతి చెందిన రంగస్థల నటుడు, ద్రాక్షారామ, మయూర కళాపరిషత్‌ల వ్యవస్థాపక కార్యదర్శి, సీనియర్ జర్నలిస్ట్ శృంగారం వెంకట అప్పలాచార్యర్, కళాపోషకుడు పెమ్మిరెడ్డి రామకృష్ణల సంతాప సభ ద్రాక్షారామ నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో పైండా వారి అన్నసత్రంలో ఆదివారం నిర్వహించారు. ద్రాక్షారామ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు నాగిరెడ్డి సతీష్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు స్టాలిన్, మయూర కళాపరిషత్ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, మేడిశెట్టి సదాశివదాసు, కోటిపల్లి అబ్బు, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి నరాల రాధాకృష్ణ, పరిషత్ కార్యదర్శి, సినీనటి వై.సరోజ తదితరులు ఆచారి, రామకృష్ణల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. వారి మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ కళారంగానికి, పత్రికా రంగానికి, కళాకారులకు వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పరిషత్ ఉపాధ్యక్షుడు వై.కొండ, కోశాధికారి వేమవరపు రాంబాబు, సభ్యులు అరవ విస్సు, బీఎల్ నారాయణ, పాపాజీ, గరగ బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

సినీ గేయ రచయిత సూర్యకు సత్కారం



సినీ గేయ రచయిత సూర్యను సత్కరిస్తున్న కోనసీమ ఫిల్మ్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: వర్ధమాన సినీ గేయ రచయిత శ్రీనివాస సూర్యను కోనసీమ ఫిల్మ్ అసోసియేషన్ ప్రతినిధులు అమలాపురంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం సత్కరించారు. అమలాపురం ప్రాంతానికి చెందిన శ్రీనివాస సూర్య మిస్టరీ, ఒక్కడే చిత్రాలకు పాటలు రాశారు. ఈ సినిమాలు ఈ దసరాకు విడుదల అవుతున్న నేపథ్యంలో శ్రీనివాస సూర్యను కోనసీమ ఫిల్మ్ అసోసియేషన్ అధ్యక్షుడు గనిశెట్టి రమణలాల్ ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కోనసీమ సినీ ఆర్టిస్టులు భద్రాజీ, ఎరుబండి చంటి, దుర్గారావు, ఆదుర్తి శ్రీనివాస్, నాయుడు, వెంకీ, దాస్ పాల్గొన్నారు.